

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,58,493లు, బంగారం 250 మిల్లీగ్రాములు, వెండి 39గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఫుట్‌బాల్‌ పోటీలు ప్రారంభం

పర్లాకిమిడిలో ఫుట్‌బాల్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు ఆకట్టుకున్నాయి.

- 8లో



ఘనంగా రామనవమి

ఆంధ్ర సంస్కృతి సమితి ఆధ్వర్యంలో రామనవమి ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమాలు అలరించాయి.

- 8లో

న్యూస్‌రీల్‌

ఒడియా పాఠ్య పుస్తకాల పంపిణీ



ఒడియా పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్‌: ఒడిశా భాషా పరిరక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా ఒడియా పాఠ్య పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో లాంఛనంగా తన సొంత నియోజకవర్గం ఉమ్మర్‌కోట్‌ లో ఈ పథకం ప్రారంభించారు. ప్రాథమిక విద్య కోసం బాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కలెక్టర్‌ డాక్టర్‌ శుభంకర్‌ మహాపాత్రో, జొరిగాంలో స్థానిక ఎమ్మెల్యే నర్సింగ బోత్ర,నబరంగ్‌పూర్‌ పట్టణంలో నబరంగ్‌పూర్‌ ఎమ్మెల్యే గౌరీ శంకర్‌ మజ్జి పాఠ్యంశాలు పంపిణీ చేశారు.

వీధికుక్కలకు గర్భనిరోధక టీకాలు



వలలో పడిన కుక్కలకు టీకాలు ఇస్తున్న పశువైద్య సిబ్బంది

జయపురం: పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించేందుకు జయపురం మున్సిపాలిటీ కుక్కలకు గర్భ నిరోధక టీకాలు వేయడాన్ని సోమవారం ప్రారంభించింది. నెలకు దాదాపు 200 మందికిపైగా కుక్కకాటుకు గురవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 3 వేలకు పైగా ఊర కుక్కలు తిరుగుతున్నాయి. వీటి బెడద తగ్గించడానికి గర్భ నిరోధక టీకాలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం కోసం పశు వైద్య డాక్టర్లతో పాటు ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌ చంద్ర సభర

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో 636 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా మేధాశక్తి స్కాలర్‌షిప్‌ కోసం అర్హత పరీక్షను రాశారు. వారిలో 32 మంది ప్రతిభ కనబరిచారు. అందులో మల్కన్‌గిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కుముటిగూడ ప్రభుత్వ ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి 8వ తరగతి చదువుతున్న పరుశురామ్‌ సోడి, రాజేష్‌ మాద్కమిలు ఎంపికయ్యారు. వీరిని సోమవారం జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌ చంద్ర సభర పాఠశాలలో సత్కరించారు. ఒక్కో విద్యార్థికి రూ.50వేలు మంజూరైనట్లు తెలిపారు.

మంచమే పల్లకిగా మారె..



తన స్వగ్రామం తురియాలో జయరాం పంగిని మంచం మీద ఊరేగిస్తున్న గిరిజనులు

కొరాపుట్‌: మాజీ మంత్రి, మాజీ ఎంపీ జయరాం పంగి సోమవారం కొరాపుట్‌ జిల్లా పొట్టంగి సమితి కొతియా గ్రామ పంచాయతీలో పర్యటించారు. అదే మార్గంలో తన స్వగ్రామం తురియా వచ్చింది. గ్రామంలో చైత్రపర్వం జరుగుతోందని చెప్పడంతో.. వెంటనే పంగి ఊరిలోకి ప్రవేశించారు. దీంతో స్థానికులు ఆయనను మంచంపై కూర్చోబెట్టి ఊరంతా ఊరేగించారు. స్థానికులు చూపిన ప్రేమకు పంగి భావోద్వేగానికి గురయ్యారు.

ఖుర్దాలో బాంబు పేలి ఒకరి మృతి

భువనేశ్వర్‌: ఖుర్దా ప్రాంతం సాధై గొడా గ్రామంలో సోమవారం బాంబు పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌ పై బాంబు తీసుకెళ్తుండగా ప్రమాదం సంభవించింది. బాంబుతో బైక్‌పై నుంచి కిందకి పడడంతో బాంబు పేలింది. మృతుడిని సాధై గొడా గ్రామస్తుడు నిరాకర్‌ సింఘ్‌గా గుర్తించారు. గాయపడిన యువకుడు బంటీ బరిసల్‌గా పేర్కొన్నారు. క్షతగాత్రుడిని ఖుర్దా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. శవ పరీక్ష కోసం మృతదేహాన్ని ఇదే ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు జరుగుతోంది.



దీపారాధనలో భక్తులు



ముద్దుపూల చెట్టు వద్ద భక్తుల సందడి

చైత్రోత్సవ వేళ

- నేటి నుంచి మజ్జి గౌరి అమ్మవారి చైత్రోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

రాయగడ:

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, రాయగడ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

జంఝావతి నది జలాలు

అమ్మవారి చైత్రోత్సవాల ప్రారంభానికి ఒక రోజు ముందు సమీపంలో గల జంఝావతి నది నుంచి జలాలను తీసుకువచ్చి అమ్మవారి సన్నిధిలో ఉంచి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. నది వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించిన పురోహితులు పూజా కార్యక్రమాల అనంతరం జలాలను కలశాలతో తీసుకువచ్చి అమ్మవారిని అదేవిధంగా అమ్మవారి గర్భగుడిని శుద్ధి చేస్తారు. అదేరోజు రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్‌ బెరుకొ, బాబుల బెరుకొలు అమ్మవారిని సింధూరంతో అలంకరిస్తారు.

సునా భెషాలో అమ్మవారు

అమ్మవారి చైత్రోత్సవాల సందర్భంగా ఉత్సవాల ఐదు రోజుల పాటుగా అమ్మవారిని బంగారు నగలతో అలంకరిస్తారు. సునా భెషాను తిలకించి భక్తులు మురిసిపోతారు.

ఆంధ్ర భక్తుల తాకిడి

ఉత్కళాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా గుర్తింపు పొందిన మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకునేందుకు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా పార్వతీపురం, విశాఖపట్నంతో పాటు తెలంగాణ, అటు మధ్యప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌ వంటి రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ప్రతీ ఆది, మంగళ ,బుధవారాల్లో వీరి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఏప్రిల్‌ నుంచి సెప్టెంబరు నెల వరకు పొరుగు రాష్ట్రాల భక్తులతో మందిరం కిటకిటలాడుతుంది. భక్తుల తాకిడిని ఉద్దేశించి వారికి సౌకర్యం కల్పించే విధంగా ప్రత్యేక దర్శనాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. అందుకు 300 రూపాయల టిక్కెట్లను విక్రయిస్తుంది.

రూ.15లక్షలతో ఉత్సవాలు

అమ్మవారి చైత్రోత్సవాలకు ఈ ఏడాది రూ.15 లక్షలు వెచ్చించనున్నారు. ఏటా లాగానే గంజాం జిల్లా కవిసూర్యనగర్‌కు చెందిన జ్యోతిష్య పండితులు నీలమాధవ త్రిపాఠి శర్మ బృందంతో పూజా కార్యక్రమాలను నిర్వహించనుంది. చండీ హోమం, సూర్యపూజ, నిత్య ఆరాధన వంటి పూజలు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

రూ.30 కోట్లతో అభివృద్ధి

అమ్మవారి మందిరంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులను కేటాయించింది. అందుకు పనులు ప్రారంభించేందుకు ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే అమ్మవారి మందిరం రూపురేఖలే మారనున్నాయి.

సంధ్యా హారతి

ప్రతీ రోజూ అమ్మవారిని భక్తులను దర్శించుకునేందుకు ముందుగా ఉదయం, సాయంత్రం హారతి కార్యక్రమాలు ఉంటాయి. ఇందులో సంధ్యా హారతి ప్రత్యేకం. ప్రతీ రోజు సాయంత్రం 6 గంటలకు ఈ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పూజారుల బృందం ఈ హారతి సమయంలో భారీ ఢమరుకాలను మోగిస్తారు. హారతి సమయంలో అమ్మవారి గర్భగుడిని చీకటి చేస్తారు. ఆ చీకటిలో హారతి వెలుగులో అమ్మవారు దర్శనం ఇస్తారు.

స్థల చరిత్ర


క్రీస్తుపూర్వం 16 వ శతాబ్దంలో నందపూర్‌ రాజవంశస్తులకు చెందిన విశ్వనాథ్‌ దేవ్‌ గజపతి అనే రాజు రాజ్యాలను విస్తరించే దిశలో రాయగడలోనికి అడుగుపెట్టారు. రాయగడలో రాజ్యాన్ని స్థాపించిన ఆయన మజ్జిగౌరి దేవిని ఇష్టాదేవిగా పూజిస్తుండేవారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని కోట మధ్యలో స్థాపించి పూజించేవారు. కోట మధ్యలో కొలువుదీరడంతొ అమ్మవారిని మొరిఖిఘోరియాణి గా పిలుస్తారు. తెలుగులో మజ్జిగౌరిగా ఒడియాలో మోరిఖిఘొరియాణిగా ప్రతీతి.

108 మంది రాణుల సతీసహగమనం

రాయగడ రాజ్యాన్ని పాలిస్తుండే విశ్వనాథ్‌ దేవ్‌ మహారాజుకు 108 మంది రాణులు ఉండేవారు. గోల్కొండను పాలించే ఇబ్రహిం కుతుబ్‌షా సేనతో రాయగడపై దండెత్తారు. ఈ పోరాటంలో విశ్వనాథ్‌ దేవ్‌ హతమవుతారు. దీంతో ఆయన 108 మంది రాణులు అగ్నిలోకి దూకి ఆత్మార్పణం చేసుకుంటారు. ఈ స్థలాన్ని సతీకుండంగా పిలుస్తారు. ప్రస్తుతం అమ్మవారి మందిరానికి పక్కనే ఈ సతీకుండం ఉంది. మందిర కమిటీ దీని ప్రాధాన్యతను గుర్తించి అభివృద్ధి చేసింది. అయితే కోట కూలిపోవడం అంతా శిథిలమవ్వడంతొ అమ్మవారి మందిరం కూడా శిథిలమవుతోంది.

బ్రిటీష్‌ వారి ఆగమనంతో..

1936 వ సంవత్సరంలో బ్రిటీష్‌ వారు విజయనగరం నుంచి రాయిపూర్‌ వరకు రైల్వే పనులు ప్రారంభించించే సమయంలో జంఝావతి నది పై వంతెన నిర్మాణం పనులు ప్రారంభిచారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్‌ వంతెన పనులను ప్రారంభిస్తారు. వంతెన నిర్మాణం జరగడం అదేవిధంగా కూలిపోవడం క్రమేపీ చోటు చేసుకుంటాయి. దీంతో ఒక రోజు కాంట్రాక్టరు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అమ్మవారు కాంట్రాక్టర్‌ కలలో కనిపించి తాను ఇక్కడే ఉన్నానని, తనకు చిన్న గుడి ఏర్పాటు చేసి నిత్యపూజా కార్యక్రమాలు జరిపిస్తే జంఝావతి నదిపై తలపెట్టిన వంతెన పనులు పూర్తవుతాయని చెబుతుంది. దీంతో కలలో కనిపించిన అమ్మవారి మాటలు ప్రకారం వెతిక చూడగా ఒక శిథిలమైన మందిరంలో అమ్మవారి విగ్రహం ఉంటుంది. అయితే అప్పటికి అమ్మవారి తల భాగమే కనిపిస్తుంది. దీంతో కాంట్రాక్టరు మందిరాన్ని నిర్మించి అమ్మవారి ముఖభాగమే ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు చేపడతాడు. అనంతరం వంతెన పనులు చకచక పూర్తవుతాయి. ఇప్పటికీ ఈ వంతెన అమ్మవారి మందిరానికి సమీపంలో ఉంది. అప్పటి నుంచి అమ్మవారి ముఖభాగమే భక్తులకు దర్శనం ఇస్తుండటం ఇక్కడి విశేషం. ఇదిలాఉండగా అమ్మవారికి సమీపంలో అమ్మవారి పాదాల గుడి కూడా ఉంది. అదేవిధంగా నడుం భాగం మందిరానికి కొద్ది దూరంలో ఉంది. దీనినే జెన్నా బౌలిగా కొలుస్తుంటారు.



మజ్జిగౌరి అమ్మవారు



దుర్గారూపంలో అమ్మవారు



సంధ్యా హారతికి వాయిద్యాలతో పూజారుల బృందం



అమ్మవారి ఆలయ ప్రవేశ ద్వారం



అభివృద్ధి ఛాయా చిత్రం



జెన్నాబౌలి మందిరం



అమ్మవారి పాదాలు

నీటి ఎద్దడి నివారణకు కంట్రోల్‌ రూమ్‌: మంత్రి

భువనేశ్వర్‌: వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో వేసవి విపత్తు నిర్వహణ వ్యవస్థని విభాగం మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రొ సోమవారం సమీక్షించారు. ప్రత్యేక కంట్రోల్‌ రూమ్‌ ఆధ్వర్యంలో ఈ ఏడాది నీటి ఎద్దడి సమస్యల నివారణకు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. వచ్చే ఏడాది నాటికి నాటికి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈసారి వేసవిలో ఎక్కడా నీటి సమస్య ఉండదని, అవసరమైతే కంట్రోల్‌ రూమ్‌ తెరుస్తారని, ఫిర్యాదు అందిన 24 గంటల్లోపు నీటి సరఫరా సంబంధిత సమస్యల్ని పరిష్కరించడం జరుగుతుందని మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో హామీ ఇచ్చారు. నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా ప్రభావిత ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సరఫరా ఏర్పాటు అవుతుందని తెలిపారు. భూగర్భ, నదీ జల వనరులతో తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు మంత్రి వివరించారు. నదుల్లో నీటి వనరుల నిర్వహణ కోసం బ్యారేజీల నిర్మాణం చేపట్టేందుకు విభాగం యోచిస్తోందన్నారు. చలి వేంద్రాలు ఎక్కడికక్కడ తెరుస్తారని, సాధారణ అవగాహనతో ప్రజల్ని చైతన్య పరుస్తారని తెలిపారు.

పర్లాకిమిడి కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్‌



స్పందన కార్యక్రమంలో వినతులు అందుకుంటున్న కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌



అభియోగదారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌

పర్లాకిమిడి: గజపతి కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ఏడుగంటలకు గ్రీవెన్సు సెల్‌ను కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌ ప్రారంభించారు. ఈ సంయుక్త అభియోగాల స్పందన కార్యక్రమానికి ఎస్పీ జితేంద్రనాథ్‌ పండా, డీఎఫ్‌ఓ కె.నాగరాజు, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా తదితరులు హాజరయ్యారు. మొత్తంగా 49 వినతులు రాగా, అందులో వ్యక్తిగతం 3, గ్రామసమస్యలు 46, ఒక వినతిని అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రీవెన్సు సమయం ఏడుగంటలకు మార్చడంతో అనేక మంది పదకొండు గంటల తర్వాత రావడంతో కొందరు వెనుదిరిగారు.

తీర్థ యాత్రలకు వయోవృద్ధులు పయనం

- పక్కా ఏర్పాట్లు చేసిన అధికారులు

జయపురం: జయపురం సమితి నుంచి81 మంది వయో వృద్ధులు సోమవారం ఉదయం జయపురం సమితి కార్యాలయం నుంచి అయోధ్య, వారణాసి తీర్థ యాత్రలకు బయలు దేరారు. కొరాపుట్‌ జిల్లా కలెక్టర్‌ వి.కీర్తి వాసన్‌ ఆదేశాల మేరకు జయపురం బీడీవో శక్తి మహాపాత్రో జయపురం సమితిలోని 22 పంచాయతీలకు చెందిన 81 మంది వయోవృద్ధులను ఎంపిక చేసి వారిని సమితి కార్యాలయానికి రప్పించారు. వారు సోమవారం ఉదయం బస్సులలో జయపురం నుంచి కొరాపుట్‌ కలక్టరేట్‌ సమీపంలో గల సాంస్కృతిక భవనానికి వెళ్లారు. వరిష్ఠ నాగరిక తీర్థ యాత్ర యోజనలో (వయో వృద్ధుల తీర్థ యాత్ర పథకం) 2025లో వారిని అయోధ్య, వారణాశి పుణ్య క్షేత్రాలు దర్శించేందుకు తీర్థ యాత్రలకు పంపుతున్నట్లు బీడీవో వెల్లడించారు. కొరాపుట్‌లో వారందరికీ జిల్లా వైద్యాధికారులచే వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం బస్సులలో రాయగడ తీసుకెళ్తారు. రాయగడ నుంచి వారంతా మంగళవారం వారణాశి, అయోధ్యల తీర్థ యాత్రలకు రైలులో బయలు దేరుతారని వెల్లడించారు. తీర్థ యాత్రలకు వెళ్తున్న వారి బాగోగులు చూసేందుకు సమితి సామాజిక సురక్షా అధికారిని తోడుగా పంపుతున్నట్లు వివరించారు.

జయపురం మున్సిపాలిటీ నుంచి 18 మంది..

తీర్థ యాత్రల కోసం జయపురం మున్సిపాలిటీ నుంచి 18 మంది వృద్ధులను కొరాపుట్‌ పంపినట్లు జయపురం మున్సిపాలిటీ సహాయ కార్యనిర్వాహక అధికారి కృతిబాస సాహు వెల్లడించారు.

మల్కన్‌గిరి జిల్లా నుంచి వృద్ధులు పయనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా నుంచి కూడా 75 మంది వృద్ధులు తీర్థయాత్రలకు రెండు బస్సుల్లో సోమవారం బయలుదేరి వెళ్లారు. బస్సులను మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్‌ మడ్కమి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్‌ తీర్థ యాత్రలకు వెళ్తున్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ సోమనాథ్‌ ప్రధన్‌, వేద్బ్రర్‌ ప్రధన్‌, జిల్లా సామజిక భద్రతా అధికారి సస్మీత స్వైయి, ఇతర అధికారులు ఉన్నారు.



జయపురం సమితి కార్యాలయం వద్దకు చేరిన వయోవృద్ధులు



తీర్థయాత్రలకు జయపురం నుంచి బస్సులో బయలు దేరిన వృద్ధులు



జయపురం నుంచి తీర్థ యాత్రలకు వెళ్తున్న వయోవృద్ధులు



మల్కన్‌గిరి: కొబ్బరికాయలతో పూజ చేస్తున్న మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్‌ మడ్కమి



మల్కన్‌గిరి: జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్‌ మడ్కమి, అధికారులు

క్లుప్తంగా

కొరాపుట్‌లో వినతుల స్వీకరణ


నబరంగ్‌పూర్ జిల్లాలో గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ మిహిర్ పండా

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి గ్రీవెన్స్‌సెల్ జరిగింది. కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ప్రజా సమస్యలు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 38 ఫిర్యాదుల వచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ మిహిర్ పండా, ఏడీఎం తపన్ కుమార్ కుంటీయా, డిప్యూటీ కలెక్టర్ ప్రకాష్ కుమార్ మిశ్రలు పాల్గొన్నారు.

ఉచిత తీర్థ యాత్రల బస్సులు ప్రారంభం


నబరంగ్‌పూర్ లో జెండా ఊపి యాత్ర ప్రారంభిస్తున్న దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, దేవదాస్ మహాంకుడో

కొరాపుట్: ఉచిత తీర్థయాత్రల బస్సులు ప్రారంభమయ్యాయి. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరం వద్ద దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే ప్రతినిధి దేవదాస్ మహాంకుడోలు జెండా ఊపి ఈ యాత్ర ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 148 మంది వయోవృద్ధులను ఉచితంగా వారణాశి, అయోధ్య తీసుకెళ్లనున్నారు. అందు కోసం ఐదు బస్సులు ఏర్పాటు చేశారు.

మొబైల్ దొంగల అరెస్టు

జయపురం: కత్తితో బెదిరించి ఒక యువకుడి వద్ద మొబైల్‌తో పాటు డబ్బుని దోచుకున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ బిజయ పట్నాయిక్ వెల్లడించారు. పోలీసు అధికారి పట్నాయిక్ వివరణ ప్రకారం ఈ నెల 4 వ తేదీన బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధి కాతపాడ పంచాయితీ కెందుపుట్ గ్రామం భక్త కురుటియ(24) ఏదో పనిపై హతీపకన గ్రామానికి వెళ్తున్నాడు. బొదావటాల్ గ్రామ సమీపంలో ముగ్గురు యువకులు బైక్ పై వచ్చి అతడిని అడ్డగించి కత్తితో బెదిరించి అతడి వద్ద గల మొబైల్‌తో పాటు రూ.2 వేల నగదు దోచుకుపోయారు. ఈ సంఘటనపై బాధితుడు బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో లిఖిత ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో లభించిన ఆధారాలు మేరకు ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. బొయిపరిగుడ సమితి కెందుగుడ పంచాయతీ దిశారిగుడ గ్రామం సురేష్ హరిజన్, మల్కనగిరి జిల్లా కోరుకొండ గ్రామం సత్య నాగ్‌లతో పాటు మరొకరు ఉన్నారని తెలిపారు.


377 లీటర్ల సారా స్వాధీనం


నాటుసారా కేసులో అరెస్టయిన నిందితులు

రాయగడ: జిల్లాలోని రాయగడ, కళ్యాణసింగుపూర్ ప్రాంతాల్లో అబ్కారీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 377 లీటర్ల నాటుసారా, సారా తయారీకి వినియోగించే 4,400 లీటర్ల విప్ప ఊటను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తలను అరెస్టర్ చేశారు. హతిఖొంబ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వ్యాన్‌లో 1800 కిలోల విప్ప పువ్వు బస్తాలు పట్టుబడ్డాయి. దీనికి సంబంధించి డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కలహండి నుంచి విప్పపువ్వ అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన అబ్కారీ శాఖ అధికారులు ఈ మేరకు వాహన తనఖీలను హతిఖంబ వద్ద నిర్వహించారు.


విప్పపువ్వుతో పట్టుబడిన వ్యాన్

వక్ఫ్ సవరణ బిల్లు ఓటింగ్‌పై చర్యలు


నవీన్ పట్నాయక్‌ను కలిసిన బలహీన వర్గాల ప్రతినిధులు

● మాజీ సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాజ్య సభలో వక్ఫ్ సవరణ బిల్లుపై బిజూ జనతా దళ్ వైఖరి పట్ల సందిగ్ధత తొలగడం లేదు. మరో వైపు ఈ బిల్లు సవరణకు సానుకూలంగా ఓటు వేసినట్లు ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రో బహిరంగ పరిచారు. ఆయనతో మరో ఒకరు, ఇద్దరు సభ్యులు కూడా సానుకూలంగా ఓటు వేసినట్లు వదంతులు వ్యాప్తిలో ఉన్నాయి. ఈ బిల్లు సవరణకు వ్యతిరేకంగా ఓటు వేసిన బీజేడీ సభ్యుడు మున్నా ఖాన్ ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌తో ఆయన నివాసంలో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బలహీన వర్గాల ప్రతినిధి బృందం కూడా నవీన్ పట్నాయక్‌తో ముఖాముఖి తమ గోడుని వినిపించింది.

వక్ఫ్ సవరణ బిల్లుపై సానుకూలంగా ఓటు వేసిన బీజేడీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ బృందం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్‌కు తమ గోడుని వినిపిస్తూ... మీరు కేవలం రాజకీయ నాయకుడు కాదు. మీరు మాకు కుటుంబం.. మీరు న్యాయం చేయాలని బీజేడీ అధ్యక్షుడిని కలిసిన ప్రతినిధి బృందం అభ్యర్థించింది. వారి గోడుని ఆలకించిన నవీన్ పట్నాయక్ వక్ఫ్ బిల్లుపై రాజ్యసభలో జరిగిన ఓటింగ్‌పై తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో ఏమాత్రం వెనుకంజ వేసేది లేదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేడీ ఒక లౌకిక పార్టీ అని పేర్కొన్నారు. ఈ ఆదర్శంతో కంధమల్ అల్లర్ల తర్వాత రాష్ట్రంలో బీజేపీతో పొత్తును తెగ తెంపులు చేసుకుందని ప్రతిపక్ష నాయకుడు.. ప్రతినిధి బృందానికి గుర్తుచేశారు.

వినతుల వెల్లువ


రాయిగడ: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఫరూల్ పట్వారి


కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధుడు

రాయగడ: జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం వినతులు స్వీకరించారు. 50 వినతులను జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి స్వీకరించారు. వీటిలో 32 వ్యక్తిగత సమస్యలు.. 12 గ్రామ సమస్యలు, మరో 6 ఆరోగ్యపరమైన సమ్యలుగా గుర్తించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఐదుగురుకి రూ.61 వేల ఆర్థికసాయన్ని అందించారు. మరొకరికి రెడ్ క్రాస్ నిధుల నుంచి రూ. 30 వేల సహాయాన్ని అందించారు. సామూహిక గ్రామ సమస్యల్లో భాగంగా వచ్చిన వినతులను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ఎస్పీ స్వాతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖెముండొ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో 25 వినతుల స్వీకరణ..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ 25 వినతులు స్వీకరించారు. మల్కన్‌గిరి పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వినతిపత్రాలను అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, జిల్లా సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ చంద్ర సబర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు


భువనేశ్వర్: ఏసీప ప్రాంగణంలో ఉత్సవ పూజలు అందుకుంటున్న సీతారామ లక్ష్మణుల సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు


కొరాపుట్ మెయిన్ రోడ్డులో ఛత్రపతి శివాజీ వేషాధారణలో..

కొరాపుట్: శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం రాత్రంతా కొనసాగాయి. కొరాపుట్, దమంజోడి, ఉమ్మర్‌కోట్, నందపూర్ తదితర పట్టణాలలో యువత నృత్యాలు చేస్తూ శోభాయాత్రను కొనసాగించారు. ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కొన్నిచోట్ల సోమవారం ఉదయం వరకు శోభాయాత్రలు జరిగాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు, ఉత్సవ కమిటీలు చర్యలు తీసుకున్నాయి.

భువనేశ్వర్: స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా నిత్యం రెండు పూటలు వేకువ జాము నుంచి సీతారామ లక్ష్మణుల సమేత ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజాదులు నిర్వహిస్తారు. సాయంత్రం వేళలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సమితి ఉత్సవ ప్రాంగణం భక్త జనంతో కళకళలాడుతుంది. నవమి సందర్భంగా ఖరగపూర్ వికాస్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ బృందం వారిచే కూచిపూడి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.


భువనేశ్వర్:నవమి ఉత్సవాల్లో వికాస్ డ్యాన్స్ బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన


భువనేశ్వర్:ఉత్సవాలకు హాజరైన సమితి సభ్యులు


కొరాపుట్:తెంతులకుంటి సమితి చొరముల్లాలో తెలుగు ప్రజలచే నిర్వహిస్తున్న రామాలయంలో మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని దంపతుల పూజలు


రాయిఘర్ బెంగాలీ శరణార్థులచే శీతల పానీయాల వితరణ


కొరాపుట్ మెయిన్ రోడ్డులో ఊరేగుతున్న భారీ రామ పాదాలు

ప్రారంభమైన పోలీస్ హాకీ పోటీలు


క్రీడోత్సవ సంచికను ఆవిష్కరించిన అతిథులు

భువనేశ్వర్: అఖిల భారత పోలీస్ క్రీడల నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో ఒడిశా పోలీసులు నిర్వహిస్తున్న 73వ అఖిల భారత పోలీస్ హాకీ చాంపియన్‌షిప్ - 2025 సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఏడో బెటాలియన్ గ్రౌండ్‌లో పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 15 వరకు స్థానిక కళింగ స్టేడియంలో ఈ పోటీలు నిరవధికంగా కొనసాగుతాయి. లీగ్ కమ్ నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళాల జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవానికి రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీజీపీ పోటీలో పాల్గొనే అన్ని జట్లు, కోచ్‌లు, క్రీడా అధికారులను స్వాగతించారు. శారీరిక దారుఢ్యత, క్రమశిక్షణ, సమైక్యత భావాల ప్రేరణకు పోలీసు దళాలలో క్రీడల ప్రోత్సాహం ప్రాముఖ్యతను సంతరించుకుంటుందన్నారు. జాతీయ క్రీడలలో ప్రధానంగా వాటర్ స్పోర్ట్స్, షూటింగ్, హాకీలో ఒడిశా తారస్థాయి నైపుణ్యతతో ఎదుగుదల సాధించడం పట్ల డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. క్రీడా ప్రతిభను పెంపొందించడంలో రాష్ట్ర పోలీసుల ప్రయత్నాలను అభినందించారు. క్రీడాకారులు ఉమ్మడి కృషి, న్యాయసమ్మతమైన పోటీతో క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం చాంపియన్‌న్‌షిప్ ఇన్‌స్పెక్టరు జనరల్ (శిక్షణ), చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక కార్యదర్శి అనుప్ కుమార్ సాహు పరిచయ ప్రసంగంతో ప్రారంభమైంది. అదనపు డీజీపీ (ప్రధాన కార్యాలయం)య కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షుడు దయాళ్ గంగ్వార్, అదనపు డీజీపీయ చాంపియన్‌షిప్ కమిటీ ఉపాధ్యక్షుడు రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన జాగులై మాత వసంత నవరాత్రి ఉత్సవాలు


మహిషాసుర మర్ధిని స్వరూపంలో జాగులై మాత దర్శనం

భువనేశ్వర్ : జట్నీ మునిసిపాలిటీ కుదియారి గ్రామ దేవత జాగులై మాత వసంత నవరాత్రి ఉత్సవాలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహిషాసుర మర్ధిని అలంకరణలో జాగులై మాతని గ్రామస్తులు కనులారా దర్శించుకుని తరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి స్థానికులతో పరిసర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సామూహిక ప్రసాద సేవలో పాల్గొన్నారని ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రాధా మోహన్ పట్నాయక్, కార్యదర్శి లక్ష్మీ ధర మహంతి తెలిపారు.

విదేశీ మద్యం స్వాధీనం

–ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం బాటిళ్లతో నిందితుడు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఒక ఇంటిపై అబ్కారీ శాఖ అధికారులు సోమవారం దాడులను నిర్వహించి 20 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ప్రశాంత కుమార్ సాహు అనే యువకుడిని అరెస్టు చేశారు. విదేశీ మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అబ్కారీ శాఖ అధికారి ఛబిరాజ్ అధికారి నేతృత్వంలో ఎస్ఐ రంజాన్ ఖాన్, కానిస్టేబుల్ సుశాంత గౌడ తదితరులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. అరెస్టయిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

'వర్ణబోధ' పుస్తకాలు పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దాస్

పర్లాకిమిడి: ఒడియా భాషా పక్షోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఒడియా భాష, సాహిత్యం సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు మధుసూదన్‌రావు రచించిన 'వర్ణబోధ' (పెద్దబాలశిక్ష) పుస్తకాలను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ సోమవారం పంపిణీ చేశారు. స్థానిక గాంధీ మెమోరియల్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వర్ణబోధ పుస్తకాలను అందజేశార. పునఃముద్రణ జరిగిన వర్ణబోధలో ఒడియా భాష ఉచ్చారణ, పేర్లు, బొమ్మల రూపంలో ఉంటాయి. కార్యక్రమంలో జిల్లా ముఖ్య విద్యాధికారి డాక్టర్ మాయాధర్ సాహు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.తిరుపతి రావు, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారిని అర్చనా మంగరాజ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం ద్వారా స్థిరమైన అభివృద్ధి


సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో 3వ వ్యవసాయ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్.

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో సేంద్రియ వ్యవసాయం పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఆయన ఆర్.సీతాపురంలో మూడో ఉత్కళ కృషి మేళాను గౌరవ అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కృషి మేళాకు ముఖ్యఅతిథిగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) డిప్యూటీ డైరక్టర్ (ఫిషరీస్) డా.జయకృష్ణ జెన్నా, జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ముఖ్యఅటవీ శాఖ అధికారి కె.నాగరాజు, ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, రిజిస్ట్రార్ అనితా పాత్రో తదితరులు హాజరయ్యారు. ఆచార్య డి.ఎస్.రావు మాట్లాడుతూ ముఖ్యంగా సన్నకారు రైతులు తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందే పంటలు వేయాలని, 2030 కల్లా రైతుల ఆదాయం రెండింతలు కావాలన్నారు. అందుకు సూక్ష్మ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక యంత్రాలు ఉపయోగించాలని అన్నారు.

అనంతరం ముఖ్యఅతిథి ఐకార్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ జె.కె జెన్నా మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ఫిషరింగ్ రంగంలో ఆక్వా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించాలన్నారు. అనంతరం అతిథులు వ్యవసాయ మేళాలో ఏర్పాటుచేసిన 50 వివిధ ఎన్‌జీఓ సంస్థలు, ఫార్మర్ ప్రోడక్ట్స్ కంపెనీలు, సెంచూరియన్ వ్యవసాయ, ఫిషరీస్, వెటర్నరీ స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం మేళాకు విచ్చేసిన కొందరి రైతులకు మట్టి పరీక్షల హెల్త్‌కార్డులు, ఉచిత ఆరోగ్య, నేత్ర పరీక్షలు చేశారు. అనంతరం గౌరవ అతిథులను సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు డి.ఎస్.రావు, మెమొంటో దుశ్శాలువతో సత్కరించారు.


సెంచూరియన్ వ్యవసాయ మేళాలో వివిధ ఫిషరీస్, వ్యవసాయ స్టాల్స్

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: సీఎం ట్రోఫీ కోసం గజపతి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను స్థానిక గజపతి స్టేడియంలో సోమవారం ఉదయం కలెక్టర్ బిజయకుమార్ దాస్ ప్రారంభించారు. ఈ పోటీలకు 15 ఏళ్ల లోపు విద్యార్థులు 176 మంది జిల్లాలో పలు ఉన్నత విద్యాలయాల నుంచి హాజరయ్యారు. ఈ పోటీలకు జిల్లా ఎస్పీ జితేంద్రనాథ్ పండా, క్రీడాధికారి కమలకాంత పండా, జిల్లా ముఖ్యశిక్షాధికారి మాయాధర్ సాహు, డి.సి.పి.యు అరుణ్‌కుమార్ త్రిపాఠి తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనటం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా పీఈటీ సురేంద్ర కుమార్ పాత్రో తెలియజేశారు. ఈ ఫుట్‌బాల్ పోటీలకు వివిధ విద్యాలయాల నుంచి పీఈటీలు ధర్మేంద్ర సామల్, రేఖారానీ దేవ్, తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ముఖ్యమంత్రి చాంపియన్‌షిప్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ నెల 15వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. మొదటి మ్యాచ్‌లో మా మజ్జిగౌరి ఫుట్‌బాల్ క్లబ్ జట్టు, బైరాగి హలువ ఫుట్‌బాల్ క్లబ్ జట్ల మధ్య జరిగింది. మా మజ్జిగౌరి జట్టు 3–0 గోల్స్‌తో విజయం సాధించింది. జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు.


రాయగడ: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్


ఫుట్‌బాల్ పోటీల ప్రారంభ సభలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, డీఈఓ, తదితరులు


రాయగడ: క్రీడాకారులతో అధికారులు

వర్కింగ్ ఉమెన్ ఉద్యోగుల భవనం ప్రారంభం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో వర్కింగ్ మహిళా ఉద్యోగుల పిల్లల్ని (0 నుంచి 3 వయస్సు) చేరదీసి వారిని లాలించడానికి, వారి సురక్షా కోసం 'కలికా' భవనాన్ని కలెక్టర్ బిజయకుమార్ దాస్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో కె.నాగరాజు, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణాధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అంశుమాన్ మహాపాత్రో, జిల్లాసామాజిక సంక్షేమ శాఖ అధికారిని మనోరమా దేవి, డీసీపీయూ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


కలికా భవనంలో పిల్లల్ని చూస్తున్న కలెక్టర్

గంజాం బార్ అసోసియేషన్ ఎన్నిక


నూతన కార్యవర్గం

బరంపురం: గంజాం బార్ అసోసియేషన్‌ను న్యాయవాదులు ఎన్నుకున్నారు. సోమవారం బార్ అసోసియేషన్ తాత్కాలిక కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారంలో న్యాయవాది మనోజ్ పట్నాయక్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా వెంకటరావు, సహాయ కార్యదర్శులుగా త్రిముల్ కుమార్‌రెడ్డి, అసిత్ సావత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై పోరాడతామన్నారు. సంక్షేమం కోసం పాటుపడతామన్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది మోహన్ శింగారి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ అధ్యక్షుడు నయన్ చంద్ర మహాపాత్రో, ఎడిటర్ బిరించి మహాపాత్రో, రామ్‌ప్రసాద్ పండా, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



నెల్లిమర్ల: స్వాధీనం చేసుకున్న బియ్యం

నెల్లిమర్ల: మండలంలోని బుచ్చన్నపేట జంక్షన్‌లో ఉన్న కురమా కమల ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల(19 బ్యాగులు) పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వారికి అందిన సమాచారం మేరకు ఆ విభాగం ఎస్సై రామారావు సిబ్బందితో కలిసి దాడిచేశారు. పట్టుబడిన బియ్యాన్ని బొప్పడాం రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు సీఎస్‌డీటీ శంకరరావు తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పెదబొండపల్లిలో..



పార్వతీపురం రూరల్: పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పార్వతీపురం రూరల్: తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లిలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లగేజీ ఆటోను అదుపులోకి తీసుకుని 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ డి. సింహాచలం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన మాట్లాడుతూ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం ముగడ గ్రామం నుంచి వయా పెదబొండపల్లి మీదుగా ఒడిశాలోని అలమండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో దారి కాచి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనలో పీడీఎస్ బియ్యంతో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని పార్వతీపురం రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు. దాడుల్లో పార్వతీపురం సీఎస్‌డీటీ ఎం.రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రేగిడి పాఠశాల ప్రతిభ



జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఉమామహేశ్వరిని అభినందిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు తదితరులు

రేగిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయస్థాయిలో చక్కని ప్రతిభ కనబరిచింది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్, న్యూఢిల్లీ అటల్ టింకరింగ్ ల్యాబ్, నీట్ ఆయోగ్‌తో సంయుక్తంగా ఆన్‌లైన్‌లో 2024–25 ఏడాదికి గాను స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బూరవెల్లి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సృజనాత్మకంగా రూపొందించిన సహజసిద్ధమైన హెయిర్‌డై ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. దేశంలో మొదటి 100 స్థానాల్లో ఈ ప్రాజెక్టుకు చోటు లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికకాగా అందులో రేగిడి ప్రాజెక్టు ఒకటి. ఈ ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం మొదటి విడతగా రూ.35వేలు నిధులు విడుదల చేసిందని ఉపాధ్యాయిని ఉమా మహేశ్వరి తెలిపారు. ఈ ప్రాజెక్టును జూలై 29న ఢిల్లీలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, సైన్స్ అధికారి రాజేష్, జిల్లా సైన్స్‌ఫోరం ప్రతినిధులు సన్యాసినాయుడు, వేణుగోపాల్ తదితరులు ఉమామహేశ్వరిని అభినందించారు.

బైక్‌లు ఢీకొని మహిళకు గాయాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. సోమవారం కురుపాం మండలంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలం జి.శివడ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బి.జీవిరావు, భార్య ప్రియతో కలిసి కురుపాం వస్తుండగా..కురుపాం నుంచి చందు అనే యువకుడు ద్విచక్రవాహనంపై గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని మూలిగూడ జంక్షన్ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రియకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన ప్రియను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా వైద్యసేవలు అందించారు. సంఘటనపై కురుపాం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వెంకటరాజపురంలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగులు సోమవారం దర్శనమిచ్చాయి. ఉదయం సుభద్రమ్మవలస, వెంకటరాజపురంలో ఉన్న వరి పంటను ధ్వంసం చేసి సాయంత్రానికి బాసంగి పరిసర ప్రాంతాల్లోకి జారుకున్నాయి. రాత్రి సమయాన గ్రామంలోకి చొచ్చుకురావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్‌ఎస్‌కు 118 వినతులు

పార్వతీపురంటౌన్: పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుంచి 110 అర్జీలు స్వీకరించారు. సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యతగల ఎండార్స్‌మెంట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు.

పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల్లో కొన్ని ఇలా..

- కురుపాం మండలం అగంగూడ గ్రామంలో 56 కుటుంబాల వారు తాగునీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో వేరే ప్రాంతానికి వెళ్లి నీరు తీసుకువస్తున్నామని, వేసవి కారణంగా బావినీరు ఇంకిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అర్జీ చేశారు.
- కొఠియా గ్రామాలైన పగలు చెన్నూరు, పట్టుచెన్నూరు, కొదమ, గంజాయిభద్ర గ్రామాల్లో విద్యార్థులకు తెలుగు భాష అర్థం కాకపోవడంతో జాతాపు వలంటీర్లను నియమించాలని అర్జీ అందజేశారు.
- పాచిపెంట మండలం ములయ కంబూరు పంచాయతీలో ములగపాడు, కందివలస, కాకుల మామిడి గ్రామాలకు లాగే కీరంగి పంచాయతీలోని వంకమామిడి, కప్పరాయి గ్రామాలకు తాగునీటి బోర్లు మంజూరు చేయాలని విన్నవించారు.
- కురుపాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువలు, రహదారి పనులు పూర్తి చేసి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.
- జియ్యమ్మవలస మండలం బూరిరామినాయుడు వలసలో సామాజిక భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్తులు వినతి అందజేశారు.
- వందశాతం వైకల్యంతో మంచాన పడిఉన్న తనకు ఎన్టీఆర్ భరోసా కింద రూ. 15వేలు పింఛన్ అందజేయాలని వీరఘట్టం మండలం దశమంతపురం గ్రామానికి చెందిన ఎన్. విజయకుమార్ దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డ్వామా పీడీ రామచంద్రరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

జవాబుదారీ తనంతో పిటిషన్లకు పరిష్కారం

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి జవాబుదారీ తనంతో వ్యవహరించి పిటిషన్లకు పోలీసు శాఖ పరంగా పరిష్కారం చూపించడనున్నట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల దగ్గర 9 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో మోసాలు ఉన్నాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితరులు ఉన్నారు.



పార్వతీపురం రూరల్: ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పీజీఆర్‌ఎస్‌కు 56 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 56 వినతులు వచ్చాయి. పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి వినతులు స్వీకరించారు. చెక్‌డ్యాం నిర్మించాలని కుమ్మరిగుంటకు చెందిన శంకరరావు కోరారు. సీసీ రహదారి నిర్మించాలని కోతాంకు చెందిన బిడ్డిక శ్రీను విన్నవించారు. గురండికి చెందిన రవికుమార్ చేసిన రోడ్డుపనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. లక్కాయిగూడ –శిలిగాంకు నూతన రహదారి నిర్మించాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. సన్నాయిగూడ గిరిజనులు పవర్‌వీడర్ ఇప్పించాలని విన్నవించారు. సీసీ డ్రైన్స్ నిర్మించాలని దిగువదరబ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్వీ గణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, డీఈ సింహాచలం పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే ధ్యేయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ప్రజాసమస్యల పరిష్కార 187 వినతులు



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు పోటెత్తిన అర్జీదారులు

విజయనగరం అర్బన్: ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు అర్జీదారుల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్రాలకు అర్జీదారులు రావాల్సిన పని లేకుండా గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల పేరుతో దాదాపు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల ప్రభావం కనబడలేదు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 187 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా 88 వినతులు రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయి. అర్జీల స్వీకరణ ప్రక్రియలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీ, ప్రమీల గాంధీ పాల్గొన్నారు.



పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఎస్పీ వకుల్ జిందల్ ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలపరిష్కార వేదికకు 42 ఫిర్యాదులు. అందాయి. భూతగాదాలు, కుటుంబసమస్యలు, మోసాలకు చెందిన సమస్యలతో ఫిర్యాదు దారులు ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి వచ్చారు. ఫిర్యాదు దారుల సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ వకుల్ జిందల్ ఫిర్యాదుల్లో ఉన్న విషయాలను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫిర్యాదుదారుల ముందే ఫోన్‌చేసి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అంతేకాకుండా వీడియో కాల్ చేసి మరీ స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదులకు ఏడు రోజుల్లో పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో శాఖాపరమైన విధులను గుర్తించాలి

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



శిక్షణ ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ

పార్వతీపురం రూరల్: జిల్లాకు శిక్షణ నిమిత్తం కేటాయించిన 36మంది ప్రొబేషనరీ ఎస్సైలు సోమవారం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారితో ఎస్పీ మాట్లాడుతూ దిశానిర్దేశం చేశారు. పోలీస్‌శాఖలో అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలను ముందుగా అభినందించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లను శిక్షణ నిమిత్తం వారికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీతో పారదర్శకంగా జవాబుదారీ తనం పాటిస్తూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని కోరారు. కేటాయించిన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలను తరచూ సందర్శిస్తూ ముఖ్యంగా ఏఓబీ ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకం అవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకితా సురానా, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఆర్ఐలు నాయుడు, రాంబాబు తదితరులున్నారు.


కుస్తీలో కొండవెలగాడ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన జూనియర్ కుస్తీ పోటీల్లో ఎల్ చైతన్య 44 కిలోల విభాగంలో బంగారు పతకం, ఎం.రణదీప్ 48 కిలోల విభాగంలో రజత పతకం, ఎస్ రామాంజనేయులు 47 కిలోల విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నారు.

పట్టపగలే చోరీ..!



దర్యాప్తు చేస్తున్న సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం పోతనాపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కిలపర్తి కొండమ్మ ఇంట్లో సోమవారం ఉదయం దొంగతనం జరిగింది. ఈ చోరీపై ఎస్.కోట సీఐ నారాయణమూర్తి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిలపర్తి కొండమ్మ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లతో ఎస్‌కోట-విజయనగరం ప్రధాన రహదారిలో నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం 10గంటల సమయంలో కొండమ్మ ఉపాధి పనులకు వెళ్లగా, కోడళ్లు పోతనాపల్లి గ్రామంలోకి వెళ్లారు. పెద్దకొడుకు తన కూతుర్ని తీసుకుని అదే గ్రామంలో ఉన్న మరదలి ఇంటికి వెళ్తూ, ఇంటికి తాళం వేసి గేటు పక్కన ఉన్న కుండీ కింద తాళం చెవి పెట్టాడు. 11.30 సమయంలో ఇంటికి వచ్చిన కొండమ్మ యథావిధిగా తాళం తీసి కాసేపు పనులు చేసుకున్న తర్వాత కొడుకు బెడ్‌రూమ్ తలుపు తెరిచి, బట్టలు కింద పడి ఉండటం గమనించి లబోదిబోమంటూ గోలచేసింది. దీంతో కుటుంబసభ్యులు వచ్చి చూడగా రెండు బెడ్‌రూమ్స్‌లో బీరువాలు తెరిచి బంగారం, నగదు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ నారాయణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్ టీమ్ ఎస్సై మురళీమోహన్‌తో ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కాగా గేటు పక్క కుండీకింద ఉన్న తాళం చెవిని తీసి, దొంగతనం చేసి మళ్లీ తాళం అక్కడే గుట్టుగా ఉంచటంతో స్థానికులు, తెలిసిన వారే దొంగతనానికి పాల్పడి ఉంటారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజీ సేకరించే పనిలో ఉన్నారు. ఈ చోరీలో సుమారు 15తులాల బంగారం, రూ.35వేల నగదు పోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చేపట్టిన ర్యాలీని పార్వతీపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభంతో ఆశాజనకమైన భవిష్యత్ నిర్ణయించుకోవచ్చన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదాన్ని అనుసరించి పుట్టిన నుంచే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, దీనికోసం మాతాశిశు ఆరోగ్యం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. గర్భిణీ, శిశు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. నిర్దేశించిన వయస్సులో వివాహం జరిపించడం, గర్భిణులకు నెలనెలా ఆరోగ్య తనిఖీలు, ఆస్పత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలు, శిశు ఆరోగ్య పర్యవేక్షణ, షెడ్యూల్ ప్రకారం టీకాలతో ఆరోగ్యకరమైన భవిష్యత్ అందజేయవచ్చన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేవీఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్‌మోహనరావు, డాక్టర్ వినోద్‌కుమార్, పీపీయూనిట్ వైద్యాధికారి డాక్టర్ విజయమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం రూరల్: జిల్లాలో గంజాయి వినియోగం, అమ్మకాల నిర్మూలనే లక్ష్యమని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి అన్నారు. గంజాయి సేవించే, వినియోగించే వారి వివరాలు సేకరణ కోసం జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రణాళికా బద్ధమైన సర్వేతో గంజాయి సేవించే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎవరైనా గంజాయి సేవించే వ్యక్తులను గుర్తించినట్‌లైతే వారి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వివరాలు ఇచ్చే వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. అన్ని కళాశాలలు, పాఠశాలల్లో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గంజాయి వినియోగించే వారి వివరాల నమోదుకు ప్రత్యేక ఫాంలు కళాశాలలు, పాఠశాలల్లో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, సీసీఎస్ సీఐ అప్పారావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొఠియా గ్రామాల్లో పర్యటనకు భద్రత కల్పించండి

- కలెక్టర్‌కు లోక్‌సత్తా వినతిపత్రం



కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా గ్రామాల్లో పర్యటించనున్నామని తమకు భద్రత కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పద కొఠియా పరిధిలో గల 21 గ్రామాల్లో ఆందోళన చెందుతున్న గిరిజనులందరికీ మద్దతుగా ఉండి పర్యటన చేపడతామని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అంగన్వాడీ భవనాలను కూల్చివేసి దిగువ శెంబి వద్ద పవర్ ప్రాజెక్టు నిర్మిస్తోందని, దీనిని అడ్డుకున్న గిరిజనులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రెవెన్యూ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులు, ఫారెస్టు అధికారులు, 108 వాహనాలను ఒడిశా అధికారులు, పోలీసులు వివాదాస్పద గ్రామాల్లోకి రానివ్వకపోయినా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహనరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గొర్లి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఇండియా పారా విజేతకు సత్కారం



సూర్యనారాయణను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం: ఈ నెల 5,6 తేదీలలో ఒడిశాలోని సంబల్‌పూర్‌లో జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పారా బిల్డర్ ఈదుబిల్లి సూర్యనారాయణ గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సూర్యనారాయణను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం మండలం వంగర గ్రామానికి చెందిన సూర్యనారాయణ జాతీయస్థాయిలో రాణించి మెడల్స్ సాధించడం జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి క్రీడల్లో జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. పారా క్రీడలకు సంబంధించిన వివరాలను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ మంత్రికి వివరించారు. పారా క్రీడాకారులకు సహకారం అందేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

త్వరలో శాటిలైట్ వ్యవస్థ పటిష్టం

- విపత్తులు, అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్



అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న విపత్తులు, అగ్నిమాపక డైరెక్టర్ జి. శ్రీనువాసులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా శాటిలైట్ వ్యవస్థను పటిష్టపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విపత్తులు, అగ్నిమాపక శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250కోట్లతో రాష్ట్రంలోని అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణకు త్వరలోనే శ్రీకారం చుట్టేందుకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 గ్నిమాపక భవనాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. అందులో పార్వతీపురం, పాలకొండ అగ్నిమాపక కేంద్రాల నరుద్ధరణకు సంబంధించి ఒక్కో కేంద్రానికి రూ. 2.5కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ రంజన్ రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనిబాబు, అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- పాలకొండ డీఎస్పీ రాంబాబు హితవు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు, పక్కన సీఐ చంద్రమౌళి, వీరఘట్టం, పాలకొండ ఎస్సైలు కళాధర్, ప్రయోగమూర్తి

పాలకొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు హితవు పలికారు. ఇటీవల వీరఘట్టం మేజర్ పంచాయతీతో పాటు, విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలో జరిగిన సైబర్ నేరాలను తమ సిబ్బంది ఛేదించిన సందర్భంగా మంగళవారం పాలకొండ సబ్ డివిజన్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. డీఎస్పీ తెలియజేసిన కేసుల వివరాలిలా ఉన్నాయి.. గత నెల 29న సంతకవిటి మండలానికి చెందిన బొడ్డాన సుధాకర్ నుంచి రూ.12 వేలు, కోరాడ సంతోష్‌కుమార్ నుంచి రూ.15 వేలతో పాటు గత నెల 31న వీరఘట్టం మేజర్ పంచాయతీకి చెందిన ఎం.ప్రతాప్ నుంచి రూ.28 వేలు ఫోన్‌పే ద్వారా కాజేసిన సైబర్ నేరగాడిని పోలీసులు విజయవాడలో పట్టుకున్నారు. తొలుత సైబర్ నేరగాడు బాధితులకు 7569341175 అనే ఫోన్ నంబర్ ద్వారా కాల్స్ చేయడంతో ఆ నంబర్‌ను ట్రాక్ చేసి విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు వీరఘట్టానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్, కానిస్టేబల్ వి.నవీన్‌లను బృందంగా ఏర్పాటు చేసి విజయవాడకు పంపించారు. వారిని సీఐ ఎం.చంద్రమౌళి, వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ మానిటరింగ్ చేస్తూ సైబర్ నేరగాడి ఫోన్ ట్రాక్ చేసి ఎప్పటికప్పుడు ఆ వివరాలను క్రైమ్ టీమ్‌కు తెలియజేశారు. ఈ విధంగా నాలుగు రోజుల పాటు విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఫోన్‌నంబర్ ఆధారంగా గాలించి సైబర్ నేరస్తుడు మున్న వెంకట నవీన్ ఆచూకీ గుర్తించి విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

అన్ని కోణాల్లో విచారణ

ప్రస్తుతం వీరఘట్టం, సంతకవిటి మండలాల్లో సైబర్ నేరాలకు పాల్పడిన మున్న వెంకట నవీన్ బీటెక్ చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఇలా సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడి దగ్గర నుంచి రూ.55 వేలు రికవరీ చేశారు. నిందిత వ్యక్తి గూగుల్‌లో వ్యాపారులు, పెద్ద పెద్ద వర్తకుల ఫోన్ నంబర్లు సేకరించి వారికి ఎస్సై నంటూ, ఏఎస్సై నంటూ, కానిస్టేబుల్ నంటూ ఫోన్‌లు చేసి వారిని నమ్మించి ఫోన్ పే ద్వారా డబ్బులు కాజేశాడని పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని విచారణ చేసి పాలకొండలో కోర్టులో హాజరు పరిచారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు..

సైబర్ నేరాన్ని విజయవాడ వెళ్లి ఛేదించిన వీరఘట్టం హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్, కానిస్టేబల్ వి.నవీన్‌లను, మానిటరింగ్ చేసిన వీరఘట్టం ఎస్సై జి.కళాధర్, సీఐ ఎం.చంద్రమౌళిలను డీఎస్పీ రాంబాబు అభినందించారు. సమావేశంలో పాలకొండ ఎస్సై ప్రయోగమూర్తి పాల్గొన్నారు.

అవిశ్వాస నోటీసు తిరస్కరణ

- నిబంధనలకు విరుద్ధంగా అందజేసిన పార్వతీపురం కూటమి సభ్యులు
- తిప్పి పంపిన కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం:

పార్వతీపురం పురపాలక సంఘ చైర్మన్, వైస్ చైర్మన్లకు వ్యతిరేకంగా కూటమి సభ్యులు అందజేసిన అవిశ్వాస తీర్మాన నోటీసు తిరస్కరణకు గురైంది. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా నోటీసు అందజేసినట్లు గుర్తించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. సంబంధిత నోటీసును తిరస్కరిస్తూ తిప్పిపంపారు. దీంతో చైర్మన్ పీఠంపై కన్నేసి అడ్డదారిలోనైనా దక్కించుకోవాలని ఆశ పడిన కూటమి నేతలకు గట్టి షాక్ తగిలినట్టయ్యింది. వైఎస్సార్‌సీపీ నుంచి కొంతమంది కౌన్సిలర్లను అక్రమంగా కలుపుకొని.. 18 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదిస్తూ, గత నెల 24న సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభికకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నోటీసు అందజేసిన విషయం విదితమే. దీనిపై స్వయంగా ఆయన కూడా సంతకం చేయడం గమనార్హం. 15 రోజుల్లోగా నోటీసిచ్చిన సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకోవడం, తదుపరి ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం దీనిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. వాస్తవానికి కొంతమంది సభ్యుల సంతకాలను కూటమి నేతలు ఫోర్జరీ చేసిన విషయం బయటకు రావడం.. వెళ్లిన కొంతమంది తిరిగి వైఎస్సార్‌సీపీకి చేరుకోవడం వంటి కారణాలతో కూటమి నాయకులకు సైతం 'అవిశ్వాసం'పై ఆశలు సన్నగిల్లాయి. దీంతోపాటు.. ఈ తతంగం పూర్తయ్యేలోగా మరికొంత మందిని తమ పార్టీలో కలిపేసుకుందామన్న 'పచ్చ పార్టీ' ఎత్తులు ఫలించలేదు. మిగిలిన సభ్యులు వైఎస్సార్‌సీపీపై విధేయత చూపుతూ.. ఎన్ని కుట్రలు పన్నినా తాము పార్టీకి ద్రోహం చేయబోమని తెగేసి చెప్పారు.

కలెక్టర్ నిర్ణయంతో..

ఇదే సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసు ఎన్నికల సంఘ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గుర్తించారు. నోటీసును నిర్దిష్ట ఫారం-1 ప్రొఫార్మా ప్రకారం అందజేయాల్సి ఉంది. కూటమి కౌన్సిలర్లు.. కేవలం లెటర్‌పై సంతకాలు పెట్టి అందజేశారు. నిబంధనల ప్రకారం ఇది చెల్లకపోవడంతో తిరస్కరిస్తూ సంబంధిత పత్రాలను మున్సిపల్ అధికారులకు కలెక్టర్ తిప్పిపంపారు. దీంతో స్థానిక కూటమి పార్టీ నేతలకు భంగపాటు తప్పలేదు.